

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

టోల్ ఫ్రీ నెం.18002331077

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

గోదావరి వరద ఉధృతి మళ్లీ పెరుగుతున్న దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంతాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయకముందే ముంపుప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైన మేర కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, మస్కిటోకాయిల్స్, విద్యుత్ సౌకర్యానికి తగు ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

ఓపికి.. ఓటిపి కష్టం..!



ఓటిపి కోసం క్యూలైన్లలో ఉన్న రోగులు

- ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగులు అవస్థలు
- 'అబా' విధానంతో ముప్పతిప్పలు.. గంటలు తరబడి క్యూలో
- ఫోన్లు పనిచేయక, వృద్ధులకు ఫోన్లు లేక అవస్థలు
- ఆధార్ కార్డుతో ఓపి ఇవ్వాలని రోగులు వేడుకోలు
- ఎంఎఆర్ఐ స్కానింగ్‌కు పది రోజులపైనే
- గర్భిణులకు టిఫా స్కానింగ్ కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల అవస్థలు చెప్పలేని విధంగా మారాయి. సాంకేతికత పెరిగితే మరింత సులువుగా సేవలు మారాలి. అయితే ఓపి (అవుట్ పేషెంట్) చీటీ కావాలంటే ఓటిపి ఉండాల్సిందేనంటూ ప్రభుత్వం తెచ్చిన అబా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) విధానం రోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఓటిపి కోసం రోగులు గంటల తరబడి క్యూలో వేచిచూడాలి. ఫోన్లు లేని వృద్ధులు, ఆసుపత్రిలో ఫోన్ సిగ్నళ్లు సరిగా రాక ఓటిపి రాకపోవడంతో రోగులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఆధార్ కార్డు నెంబర్‌తో ఓపి ఇచ్చే విధానం ఉంటే సరిపోతుందని, ఓటిపి విధానంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రోగులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రతిరోజు 1200 మంది రోగులు వస్తుంటారు. గతంలో ఓపి విభాగంలో చీటి తీసుకుని డాక్టర్ వద్ద చూపించుకునేవారు. కొత్తగా తీసుకొచ్చిన 'అబా' విధానంలో తొలుత ఆధార్‌కార్డులతోపాటు మన వివరాలను నమోదు చేయించుకోవాలి. ఆధార్‌తో లింకైన ఫోన్ నెంబర్ ఇవ్వాలి. వివరాలు నమోదు చేసిన తర్వాత ఫోన్‌కు ఓటిపి వస్తుంది. ఆ నెంబర్ చెబితే ఓపి విభాగంలో చీటి ఇస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి కనీసం గంట నుంచి రెండు గంటలు పడుతోంది. దీంతో రోగులు అక్కడ నీరసంతో పడిపోతున్నారు. వృద్ధుల పరిస్థితి ఎంత చెప్పినా తక్కువే అవుతోంది. టెక్నాలజీ పెరిగితే పని మరింత సులభతరం కావాలిగాని, ఇలా గంటలు తరబడి వేచిచూడటం ఏమిటని అక్కడి సిబ్బందిపై రోగులు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారు. ఆధార్ నెంబర్‌తో ఓపి చీటీ ఇచ్చేలా మార్పులు చేయాలని కోరుతున్నారు.

ఎంఆర్ఐ స్కానింగ్‌కు పది రోజులుపైనే..
గర్భిణులకు టిఫా స్కానింగ్ బయటే

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మినహా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కడా ఎంఆర్ఐ, సిటీస్కానింగ్ సదుపాయం లేదు. ఏలూరు ఆసుపత్రిలో ప్రతిరోజూ 30 నుంచి 35 ఎంఆర్ఐ స్కానింగ్‌లు, 50 నుంచి 60 సిటీ స్కానింగ్‌లు మాత్రమే చేయగలుగుతున్నారు. ప్రతిరోజూ 1200 మంది అవుట్ పేషెంట్లు, 350 మందికిపైగా ఇన్‌పేషెంట్లు ఇక్కడ సేవలు పొందుతున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో ఎంఆర్ఐ, సిటీస్కానింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే అందుకు తగిన ఏర్పాట్లు ఆసుపత్రిలో లేవు. దీంతో ఎంఆర్ఐ స్కానింగ్ చేయాలంటే పది నుంచి 15 రోజుల సమయం పడుతోంది. దీంతో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోగనిర్ధారణ కాకుండా సరైన మందులు డాక్టర్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీంతో రోగంతో రోజులు తరబడి బాధపడాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యే ఎంఆర్ఐ స్కానింగ్ ఇప్పుడు దాదాపు రెండు వారాలు ఎందుకు పడుతుందో అర్థం కావడం లేదని రోగులు మాట్లాడుకుంటున్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ సమస్యలను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు. గర్భిణులకు చేసే టిఫా స్కానింగ్ సర్వజన ఆసుపత్రిలో లేకుండాపోయింది. ప్రతిరోజూ ఇక్కడ వంద మంది గర్భిణులు పరీక్షలు చేయించుకునేందుకు వస్తున్నారు. బిడ్డ పరిస్థితి తెలుసుకునేందుకు 18 నుంచి 22 వారాల్లో సమయంలో టిఫా స్కానింగ్ చేస్తారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఈ స్కానింగ్ లేకుండాపోయింది. దీంతో డాక్టర్లు బయటికి రాస్తున్నారు. దీంతో గర్భిణులు రూ.1300 వరకూ చెల్లించి టిఫా స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. దీంతో పేద కుటుంబాలకు చెందిన గర్భిణులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టిఫా స్కానింగ్ ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

రోగులు కూర్చునేందుకు బెంచీలు కరువు

రోజుకు 1200 మంది రోగులు వస్తున్న చోట కూర్చునేందుకు బెంచీలు కూడా సరిగా లేని పరిస్థితి ఏలూరు సర్వజన ఆసుపత్రిలో నెలకొంది. ఐదో నెంబర్ నుంచి పదో నెంబర్ వరకూ ఒకే వరుసలో డాక్టర్లు అవుట్ పేషెంట్లను పరీక్షిస్తారు. ఒక్కో డాక్టర్ వద్ద పెద్దఎత్తున రోగులు ఉంటారు. రోగులు చూపించుకునే గది బయట కేవలం ఆరుగురు కూర్చునేందుకు రెండు బల్లలు మాత్రమే ఉంటున్నాయి. దీంతో రోగులు డాక్టర్‌ను కలిసేవరకూ నిలబడే ఉండాల్సి వస్తోంది. తీవ్ర జ్వరం, ఇతర రోగాలతో బాధపడేవారు గంటలు తరబడి నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగుల కోసం వెయింటింగ్ హాలు నిర్మించినా అక్కడ సైతం రెండు బల్లలు మాత్రమే వేశారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో రోగుల అవస్థలు గురించి పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఆసుపత్రి ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోయి బురదమయంగా తయారైనా పట్టించుకునే పరిస్థితి లేదు. రాత్రిపూట దోమలు విపరీతంగా ఉంటున్నాయంటూ రోగుల వద్ద ఉంటున్న కుటుంబ సభ్యులు వాపోతున్నారు. సర్వజన ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



ఓటిపి విధానంతో నరకం చూస్తున్నాం

హరి, ఏలూరు

గతంలో కొనసాగిన ఓపి విధానం చాలా బాగుండేది. ఇప్పుడు ఓటిపి విధానం తేవడంతో గంటలు తరబడి నిల్చుంటే తప్ప పని పూర్తి కావడం లేదు. ఓటిపి చెబితే తప్ప ఓపి చీటీ ఇవ్వడం లేదు. నరాల సంబంధిత వ్యాధితో న్యూరో డాక్టర్‌ను కలవడానికి ఉదయం వచ్చాను. ఇప్పటి వరకూ ఓపి చీటీ తీసుకోలేదు. కొత్తవిధానం తెస్తే రోగులకు త్వరగా సేవలందాలే తప్ప ఇదేం పరిస్థితో అర్థం కావడం లేదు.ఆధార్ కార్డు చూపిస్తే ఓపి చీటీ ఇచ్చే విధానం తీసుకురావాలి.

ఎన్నిసార్లు వచ్చినా ఓటిపి ఉండాలంట..

రాముడు, మాదేపల్లి

గత నెల 14న వెన్నుపూస సమస్యతో వచ్చి చూపించుకున్నాను. అప్పుడు ఓటిపి అంటూ తీవ్ర ఇబ్బందులు పెట్టారు. ఇప్పుడు రెండోసారి చూపించుకోవడానికి వస్తే మళ్లీ ఓటిపి ఉండాలంటున్నారు. ఈ విధానంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అనారోగ్యంతో గంటలు తరబడి నిలబడలేకపోతున్నాం. ఈ విధానం తీసేసి పాతవిధానం తీసుకురావాలి.





కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు అప్రోచ్ పైకి చేరిన వరద

మళ్లీ గోదావరి గండం..!

- భద్రాచలం వద్ద 46 అడుగులకు వరద చేరే అవకాశం
- కుక్కునూరులో 15 గ్రామాలకు రాకపోకలు బంద్
- వేలేరుపాడులో పొంగిపొర్లుతున ఎద్దువాగు
- జులైలో వరదలకు నిర్వాసితులు నానావస్థలు

ప్రజాశక్తి- కుక్కునూరు, కుక్కునూరు రూరల్, వేలేరుపాడు రూరల్

వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటికే ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదులుతుండటంతో గోదావరికి వరద పోటెత్తుతోంది. భద్రాచలంలో మంగళవారం ఉదయం 27 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం సాయంత్రానికి 39 అడుగులకు చేరింది. బుధవారం ఉదయానికి 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం ఉంది. గోదావరికి వరద పోటెత్తడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గోదావరికి వరద పోటెత్తడంతో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు అప్రోచ్‌పైకి వరద నీరు చేరింది. గత జులైలో వచ్చిన వరదలకు గుండేటి వాగు అప్రోచ్‌కు ఓ వైపు గండిపడటంతో రెండు నెలలుగా 15 గ్రామాలకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. గత వరదలకు పత్తి, వరి పంటలు మొక్క దశలో నీట మునిగి రైతులకు తీవ్ర-నష్టం వాటిల్లింది. ఇక వరదలు రావని మండలంలోని రైతులు అధిక ఖర్చుతో కూడిన మిర్చి పంటను నాటే పనిలో నిమగ్నమయ్యారు. గోదావరికి వరద పెరుగుతుండటంతో విలీన మండలాల్లో రైతాంగం కంటిమీద కునుకు లేకుండాపోయింది. రెండు నెలల క్రితం వచ్చిన గోదావరి వరదలకు కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, కుక్కునూరు-ఎ బ్లాక్, వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామస్తులు పునరావాస కాలనీల్లో రెండు నెలలుగా ఉంటున్నారు. ఆగస్టు గడవడంతో వరదలు రావని భావించి ఇటీవలే తమ గ్రామాలకు చేరుకున్నారు. మళ్లీ వరద పెరుగుతుండటంతో ప్రజలు మళ్లీ పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గోదావరి నదికి వరద ఉధృతి నేపథ్యంలో ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లోని నిండు గర్భిణులను, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వేలేరుపాడు మండలం రుద్రంకోటకు చెందిన గర్భిణీని మంగళవారం వేలేరుపాడు పిహెచ్‌సికి తరలించినట్లు డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ తెలిపారు. మిగిలిన వారిని సమీప ఆస్పత్రుల్లో చేర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పొంగి పొర్లుతున్న ఎద్దువాగు

ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ఉగ్రరూపం దాల్చింది. దీంతో వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట, బొల్లపల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు వంతెన పైనుంచి వరద నీరు ప్రవహించడంతో కోయిదా, కట్కూరు, యడవల్లి, కాకిసునూరు, పేరంటాలపల్లి వంటి 15 గ్రామాలకు మండల కేంద్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు నానావస్థలు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో ఎక్కడికక్కడ విష జ్వరాలు ఉండడంతో ప్రజలు మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి చేరుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతియేటా ఇదేవిధంగా నానావస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ముంపు గ్రామాల ప్రజల గురించి ప్రభుత్వం ఆలోచించి తగు నిర్ణయం తీసుకుని న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఎద్దు వాగు ఉగ్రరూపం దాల్చడంతో రాకపోకలు నిలిచిన 15 గ్రామాల్లోని ప్రజలకు ఎటు వంటి ఇబ్బందులూ కలగకుండా బియ్యం, పంచదార, నిత్యావసర సరుకులు పంపిణీకి సిద్ధంగాఉంచినట్లు వేలేరుపాడు తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు.

4,11,238 లక్షల క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరం: గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి క్రమక్రమంగా పెరుగుతోంది. స్పిల్‌వే ఎగువన 29.550 మీటర్ల నీటిమట్టం, స్పిల్‌వే దిగువన 19.980 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుండి 4,11,238 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పోలవరం ప్రాజెక్టు ఇఇలు మల్లికార్జునరావు, పి.వెంకటరమణ తెలిపారు.

మా సమస్యలు పరిష్కరించండి

సమ్మె హామీలను అమలు చేయాలి
పలుచోట్ల ఆశావర్కర్ల నిరసన



నూజివీడులో...

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు నూజివీడు ప్రధాన కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ మేరకు ఎపి ఆశావర్కర్స్ యూనియన్, సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నూజివీడు కోనేరుపేట పిహెచ్‌సి వద్ద ఆశావర్కర్లు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ ఆశావర్కర్లకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అరికట్టి కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. ఆశావర్కర్లకు విధివిధానాలు రూపొందించిన తర్వాత రిటైర్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కమల, నాగమణి, స్వాతి, కుమారి, స్రవంతి, కుమారి, నాగలక్ష్మి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

కుక్కునూరు : ఆశావర్కర్లకు వేతనాలు పెంచాలని, 2024 ఫిబ్రవరి తొమ్మిదో తేదీన ఎపి ఆశావర్కర్స్ యూనియన్ సిఐటియు ప్రతినిధి వర్గంతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జిఒలను, సర్క్యులర్లను విడుదల చేయకుండా ప్రభుత్వం ఆశాలకు తీవ్రమైన ద్రోహం చేసిందని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. కుక్కునూరు, అమరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ధర్నా చేసి వైద్యాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ పని భారంతో అల్లాడుతున్న ఆశావర్కర్ల సమస్యలపై సార్వత్రిక ఎన్నికల రీత్యా జాయింట్ మీటింగ్స్ జరపలేదన్నారు. ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్, అదనపు పనులు, పని చేయని సెల్ ఫోన్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒక గంట పర్మిషన్, ఒక రోజు సెలవు కావాలన్నా అధికారులు దయ దాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. ఆశావర్కర్లకు సంబంధంలేని ఎన్‌ఐపిఇ, ఇతర కొన్ని ఆన్‌లైన్ వర్కులు చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశావర్కర్ల సమస్యలపై జాయింట్ మీటింగ్ వేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశాలు కారం రాజేశ్వరి, బురం శ్రావణి, రమణ, తులసి, ఆదెమ్మ, పద్మ, నాగమణి, సునీత, కనకదుర్గ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



కుక్కునూరులో...

శాంతించిన తమ్మిలేరు


ఏలూరు సిటీ : రెండు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన తమ్మిలేరు మంగళవారం ఉదయానికి శాంతించింది. దీంతో స్థానిక అమీనాపేట నుండి శనివారపుపేటకు వెళ్లే మార్గంలోని కాజ్‌వేపై రాకపోకలకు అధికారులు అనుమతిచ్చారు. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

వర్ష బాధితులను ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు

ప్రజాశక్తి - ముసునూరు

అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు, ఇళ్లు దెబ్బతిన్నవారికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన ముసునూరు, చింతలవల్లి, వలసపల్లి తదితర గ్రామాల్లో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల వల్ల వరి, పత్తి చేలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు దెబ్బతిన్న రైతులను గుర్తించి ఆదుకోవాలని కోరారు. గ్రామాల్లో జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపర్చడంతోపాటు వైద్య శిబిరాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.



వరి పొలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలి

అధికారులకు మంత్రి ఆదేశాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వర్షాలకు మరమ్మతులకు గురైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో పాడైన రహదారిని గంటల వ్యవధిలోనే అధికారులు పునరుద్ధరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నూజివీడు నియోజకవర్గంలో వాగులు పొంగడంతో పలు రోడ్లు పాడయ్యాయి. భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ప్రజలను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన మంత్రికి పూర్తిగా పాడైన నూజివీడు నుంచి గంపలగూడెం రహదారికి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అధికా రులను అదేశించడమే కాకుండా సదరు రోడ్డు మరమ్మతు పనులు ఎంతవరకు చేపట్టారని అధికారులను అడిగి ఆరా తీశారు. దీంతో అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. గంటల వ్యవధిలోనే పూర్తి చేసి, మంగళవారం ఉదయం నాటికి రోడ్డు మరమ్మతులు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో పాడైన రహదారులకు సంబంధించి జిల్లా పరిషత్ రోడ్లు, పంచాయతీ రాజ్ రోడ్లు, ఆర్అండ్‌బి, సీసీ, బిటి రోడ్ల వివరాలను సంబంధిత అధికారుల నుంచి పూర్తి నివేదికను సేకరించి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి పార్థసారధి అధికారులను ఆదేశించారు. తమ సమస్యపై వెంటనే స్పందించి రహదారి మరమ్మతు పనులు పూర్తి చేసేందుకు తీసుకున్న చర్యలకు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వం కోల్పోయాం.. ఆదుకోండి

కొప్పులవెలమపేట వాసుల వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

భారీ వర్షాలకు, వరదలకు తాము సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని కొప్పులవెలమపేట వాసులు వేడుకుంటున్నారు. నూజివీడులో గత నెల 31వ తేదీన పెద్ద చెరువుకు గండి పడి విస్సన్నపేట-తిరువూరు ప్రధాన రహదారి, నూజివీడు-హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డులో వరద ముంచెత్తింది. కొప్పులవెలమపేటలో దాదాపుగా 50 ఇళ్ల వరకు ముంపునకు గురయ్యాయి. ఆ ఇళ్లలోని వారు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. ఐదు ఇళ్లు పూర్తిగా కుప్పకూలిపోయాయి. 50 ఇళ్లకు సంబంధించిన వారికి కట్టుబట్టలే మిగిలాయి. తమకు ఇప్పటివరకు ఎటువంటి ప్రభుత్వం సాయం అందలేదని వారు వాపోతున్నారు.

జీవనం కోల్పోయాం
జొన్నాడ పార్వతి

ఇస్త్రీ చేసుకొని జీవనం సాగించే మేము వరదల కారణంగా సర్వం కోల్పోయం. జీవన ఆధారమైన ఇస్త్రీ బండితో పాటు ఇస్త్రీ పెట్టె, బట్టలు, ఇంట్లోని నిత్యావసర సరుకులు కొట్టుకొనిపోయాయి, టీవీ, ఫ్రిజ్ తడిచి పాడయ్యాయి. దాదాపుగా రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం సహాయం కోసం ఎదురు చూస్తునాం.



కొప్పులవెలమపేటలో కుప్పకూలిన ఇల్లు

గూడు కోల్పోయాం
కోమాడి విజయ్

వరదల కారణంగా నూజివీడు పెద్ద చెరువుకు గండ్లు పడి వరద తాకిడికి గురై మా ఇల్లు పూర్తిగా కూలిపోయింది. బట్టలు, నిత్యావసర సరుకులు వరదకు కొట్టుకుపోయాయి. టీవీ, ఫ్రిజ్, మంచాలు ఇంటి శిథిలాల కింద ఉన్నాయి. మొత్తాన్ని మట్టితో కమ్మేసింది. తాపీ పని చేసే నాకు ప్రభుత్వం సహాయం చేసి ఇల్లు నిర్మించాలని కోరుతున్నాను.

విజయవాడ వరద బాధితులకు ఆహార పొట్లాలు



ఆహారం తరలించే వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా నుంచి ఎన్‌టిఆర్ జిల్లాకు వరద సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున ఏలూరులో గోకుల్ కల్యాణమండపం, పత్తేబాదలోని కేటరింగ్ సెంటర్లలో అల్పాహారం తయారీ ప్యాకింగ్ పనులను, ఆహార నాణ్యతలను కలెక్టర్ పరిశీలించారు. మంగళవారం మరో 1.60 లక్షల ఆహార పొట్లాలను ఎన్‌టిఆర్ జిల్లాకు పంపించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 1.25 లక్షల ఫుడ్ ప్యాకెట్లు, లక్ష పాల ప్యాకెట్లు, లక్ష బిస్కట్ ప్యాకెట్లు, 30 వేల బ్రెడ్ ప్యాకెట్లు, 50 కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు పంపించారు. మంగళవారం ఉదయం అల్పాహారం ప్యాకెట్లను, ప్రత్యేక వాహనాల్లో పంపించారు. మధ్యాహ్నానికి, సాయంత్రానికి అవసరమైన భోజన ప్యాకెట్లు కూడా రెడీ చేసి విజయవాడకు పంపించారు. నూజివీడు, ఆగిరిపల్లి, జంగారెడ్డిగూడెం నుంచి ఆహార ప్యాకెట్లను పంపించారు.

నూజివీడు డివిజన్ నుంచి...

నూజివీడు : ఆర్‌డిఒ వై.భవానిశంకరి ఆధ్వర్యంలో నూజివీడు డివిజన్ నుంచి మంగళవారం 15 వేల ఆహార ప్యాకెట్లు పంపించారు. వాటిని విజయవాడ తీసుకువెళ్లే సంబంధిత వాహనాన్ని ఆర్‌డిఒ జెండా ఊపి ప్రారంభించారు.

ఏలూరు సిటీ : ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్ సూచనలతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 20 వేల మందికి సరిపడా టిఫిన్, మధ్యాహ్నం పది వేల మందికి భోజనాలు, ఐదు వేల పాల ప్యాకెట్లు పంపించామని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. స్వచ్ఛందసంస్థలు, దాతృత్వం కలిగిన వారు ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించాలని కోరారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఐదు వేల ఆహార ప్యాకెట్లను మంగళవారం ప్రత్యేక బస్సు ద్వారా తరలించారు. స్థానిక మక్కా మసీదు నందు ముస్లిం సోదరులు వరద బాధితుల కోసం పులిహోర ప్యాకెట్లు తయారు చేసి తరలించారు.

కలిదిండి : జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కో-కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు ఆధ్వర్యంలో మండలంలోని సానారుద్రవరం నుంచి రెండు వేల మందికి సరిపడా ఆహారాన్ని వండించి తరలించారు. ఆంధ్రా తెలంగాణా రాధా-రంగా మిత్ర మండలి అధ్యక్షులు కాళ్లపాలెం బుజ్జి, చిట్టూరి రవీంద్ర, చిరంజీవి యువత మండలాధ్యక్షులు జడ్డు సుబ్రహ్మణ్యం, సర్పంచి నున్న నాగేశ్వరమ్మ రామచంద్రరావు పాల్గొన్నారు. మండలంలోని కొండంగి గ్రామ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు, పెరుగు, మజ్జిగ, వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లను పంపించారు.

ట్రిపుల్ ఐటి మెస్ నిర్వాహకులు ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఇటీవల విద్యార్థులు అనారోగ్యం పాలై చికిత్స పొందిన సంఘటనలో కళాశాల పరిపాలన అధికారి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సిఐ ఎంవివిఎస్ఎన్.మూర్తి తెలిపారు. నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సిఐ మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీన ట్రిపుల్ ఐటి పరిపాలనాధికారి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కళాశాలలో విద్యార్థులు, సిబ్బంది, ఆవరణలోని మెస్సులో పనిచేస్తున్న వారిని, ఆరోగ్య సిబ్బందిని విచారించినట్లు చెప్పారు. నాణ్యమైన ఆహారం అందించకుండా, మెస్‌లలో అపరిశుభ్రత ఉండడం వల్ల సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థులు గత పది రోజులుగా అనారోగ్యానికి గురైనట్లు తమ విచారణలో తేలిందన్నారు. ట్రిపుల్ ఐటి యాజమాన్యం వారు మెస్ కాంట్రాక్టర్లకు ఇప్పటివరకు మూడు సార్లు నాణ్యత లోపించిన ఆహారంపై నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణలో భాగంగా కళాశాల ఆవరణలో ఉన్న ఫైన్ క్యాటరర్స్ అండ్ సప్లయర్స్ మేనేజర్ గోగినేని మధుబాబు, అనూష హాస్పిటల్ మేనేజర్ పెండ్యాల నవీన్ కుమార్‌లను అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

ఓటర్ల నమోదు గడువు పొడిగించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికలకు ఓటర్ల నమోదు గడువు కనీసం ఒక నెల రోజులపాటు పెంచాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ముస్తఫా అలీ, జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి షేక్ సాబ్జి ఆకస్మిక మృతి కారణంగా ఉప ఎన్నిక నిర్వహించడానికి ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ జారీ చేసిందని, సెప్టెంబర్ మూడు నాటికి అర్హులైన ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలు రెండింటికి ఒకేసారి ఫిబ్రవరి 2025లో ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూల్ మార్పు చేయాలని వారు కోరారు.

వరద బాధితులకు వాసవీ క్లబ్ సాయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని పెద్ద చెరువు ముంపు బాధితులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ ఆలయం వద్ద మంగళవారం బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ప్రెసిడెంట్ వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆపదలోని పేదలను ఆదుకోవడం ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించాలన్నారు.

సహాయక చర్యల్లో పాల్గొనండి

ప్రజాశక్తి - కామవరపుకోట

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విజయవాడ ప్రజలు వరదల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా విజయవాడ 44వ వార్డులో సహాయక చర్యలకు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌ఛార్జిగా ప్రకటించిన సందర్భంగా టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు, అనుబంధ కమిటీ అధ్యక్షులతో మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ ప్రెస్‌మీట్ నిర్వహించారు. తన మిషన్ హోప్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రోషన్‌కుమార్ మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి సహాయక చర్యల్లో భాగంగా బాధితులకు పాలు, మంచినీళ్ల బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్ తదితర ఆహార పదార్థాలు పంపిణీ చేయనున్నట్లు కిలారు సత్యనారాయణ తెలిపారు. మన నియోజకవర్గం తరుపున జరిగే ఈ సహాయక చర్యల్లో మండలంలోని కూటమి క్రియాశీలక నాయకులు, కార్యకర్తలు నాలుగో తేదీ ఉదయం బయలుదేరి సహాయక చర్యల్లో పాల్గొనాలని సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు జుజ్జూరి బాబ్జీ, వజీర్ ఖాన్, మాన్యం దుర్గారావు, డోలా విజయ్, కొప్పిసెట్టి చిన్న, రాజులపాటి లక్ష్మీనారాయణ, కొమ్మిన నవీన్‌కృష్ణ, అడపా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేత

ప్రజాశక్తి - కామవరపుకోట

తడికలపూడి గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని తడికలపూడిలోని నాలుగు ఎంపిపి పాఠశాలల్లో విద్యార్థులకు, నాలుగు అంగన్వాడీ కేంద్రాలోని పిల్లలకు భోజనం ప్లేట్లు, గ్లాసులను తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు చేతులమీదుగా పంపిణీ చేశారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు పంచాయతీ గణేష్ నగర్ కాలనీలో నెల రోజుల నుంచి లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని కుక్కునూరు ఉప సర్పంచి దృష్టికి తీసుకెళ్లగా ఆయన టిడిపి మండలాధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. అయన విద్యుత్ అధికారులకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు.

డ్రైయినేజీలో చెత్తా చెదారం తొలగింపు

ప్రజాశక్తి - ముసునూరు

వర్షాకాలంలో డ్రైయినేజీ ఇబ్బంది లేకుండా ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా పొక్లెయిన్ ద్వారా డ్రైయినేజీలో ఉన్న చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నట్లు ఇఒపిఆర్‌డి ఎస్‌వి.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో డ్రైయినేజీలో ఉన్న చెత్తాచెదారం పొక్లెయిన్ ద్వారా తీయించి, పారిశుధ్య పనులు చేపట్టారు. బలివే, వెంకటాపురం గ్రామాల్లో వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పిచికారీ చేయటం, బలివే తమ్మిలేరు వద్ద ప్రమాదకరమైన ఇబ్బందులు లేకుండా సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేయటం, ఇలా పలు కార్యక్రమాలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద బారిన పడిన పంటలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ రైతులకు సూచించారు. మండలంలోని స్వర్ణవారిగూడెం, పాములవారిగూడెం గ్రామాల్లోని పంట భూములను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సోదరులు పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు తీసివేసి నేలను ఆరనివ్వాలన్నారు. అనంతరం వరి చేలో ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల చొప్పున మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను పిచికారీ చేయాలని సూచించారు. ఎకరాకు రెండు గ్రాముల కార్బండిజమ్‌ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెరికల్చర్ అసిస్టెంట్ ఎస్.ప్రసాద్, విఆర్ఒ కుమారస్వామి, చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాసులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాచూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద మంది విద్యార్థులకు ఆర్‌టిసి అధికారులు ఉచిత బస్ పాసులు మంగళవారం పంపిణీ చేశారు. బస్ పాస్‌ల ఐడీ కార్డులకు అయిన ఖర్చులకు జనసేన నాయకుడు మంద శ్రీనివాసరెడ్డి ఆర్థిక ప్రోత్సాహం అందివ్వడం అభినందనీయమని తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి అన్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డిని సత్కరించారు.

నేరాలు - ఘోరాలు

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గత నెల 31వ తేదీన మండల పరిధిలోని వట్టిగుడిపాడుకు చెందిన నాగా వీర్రాజు(63) పశువులకు మేత తీసుకొచ్చేందుకు వెళ్లి వట్టిగుడిపాడు-పోలసానపల్లి గ్రామాల మధ్య ఉన్న దెయ్యాల వాగులో గల్లంతయ్యాడు. అప్పటి నుంచి తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, ఎస్‌సి బి.సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, ఎన్‌డిఆర్ఎఫ్ బృందంతో వీర్రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం పోలసానపల్లి గ్రామంలో కొరివిడి చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతుడు వీర్రాజుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు నాగశ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వీర్రాజు కుటుంబాన్ని ఆదుకుంటాం : ముద్దరబోయిన

వరద ఉధృతికి వాగులో పడి మృత్యువాత పడిన నాగ వీర్రాజు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. వీర్రాజు మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

స్విమ్మింగ్ పూల్ @ డెత్ పూల్

నిబంధనలు పాటించని యాజమాన్యం!


ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నిబంధనలతో మాకు పనేముంది.. డబ్బులు వస్తే చాలు అన్న చందంగా ఉంది స్విమ్మింగ్ ఫూల్ నిర్వాహకుల తీరు. ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధిలో గత కొన్నేళ్లుగా వట్లూరు హౌసింగ్ బోర్డ్ కాలనీ దాటిన వెంటనే ఓ నీటి తొట్టెను నిర్మించారు. ఆ నీటి తొట్టె వ్యాసార్థం ప్రకారం పెద్దగా ఉన్నప్పటికీ నిర్వాహకులు స్విమ్మింగ్ ఫూల్ పేరుతో దాన్ని పరిగణించడం గమనార్హం. నగరంలోని రెస్టారెంట్ నిర్వాహకుని సోదరుడు గతేడాది మార్చి నెలలో ఇదే స్విమ్మింగ్ ఫూల్‌లో జలకాలాటలకు దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అప్పుడు మూడో పట్టణ పోలీసులు అనుమనాస్పద మృతిగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. ఇదే నేపథ్యంలో ఆదివారం ఏలూరు నగరంలోని వట్లూరు ప్రాంతానికి చెందిన అక్కినేని నగేష్ (32) స్థానికంగా ఓ సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో కేర్‌గా పని చేస్తూ భార్యతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో కేర్ టేకర్‌గా ఉన్న పిల్లల్ని ఈ స్విమ్మింగ్ ఫూల్‌లో జలకాలాటకు అతను తీసుకెళ్లాడు. అక్కడ జలకలాడుతున్న పిల్లలు ప్రమాదవశాత్తు నీట మునుగుతున్నారని భావించిన నగేష్ వారిని రక్షించేందుకు స్విమ్మింగ్‌ఫూల్‌లో దూకాడు. కొద్దిసేపటికి అతను స్విమ్మింగ్ ఫూల్‌లో ఊపిరాడక స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు ప్రస్తుతం మూడో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో వ్యక్తి మృతి చెందిన అనంతరం కొద్దిరోజుల పాటు మూసివేసిన స్విమ్మింగ్ ఫూల్‌ను మళ్లీ తిరిగి ఎటువంటి మార్పులు చేర్పులు చేయకుండా యధావిధిగా ప్రారంభించి దాని నిర్వాహకులు డబ్బులు దండుకుంటున్నారు.

స్విమ్మింగ్ ఫూల్ నిర్వహించాలంటే మొట్టమొదటిగా టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్లాన్ అప్రూవల్ తప్పనిసరిగా పొంది ఉండాలి. చిన్నారులు స్విమ్మింగ్ ఫూల్‌లో జలకలాడేందుకు రెండు లేదా మూడు అడుగుల లోతు ఏర్పాటు చేయాలి. పెద్దలు స్విమ్మింగ్ చేసే సమయాల్లో ఐదు అడుగుల నుంచి ఏడు అడుగుల వరకు సాధారణ పరిస్థితుల్లో స్విమ్మింగ్ ఫూల్ ఏర్పాటు చేయాలి. సాధారణంగా స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణం చేపట్టేటప్పుడు చతురస్రాకారంలో నిర్మాణం చేపట్టి చుట్టూ రైలింగ్ ఏర్పాటు చేయాలి. ఈ స్విమ్మింగ్ ఫూల్ అందుకు భిన్నంగా సాధారణంగా నీటి తొట్టెలను చతురస్రాకారంగా నిర్మించి చుట్టుపక్కల ఏటవాలు బద్దలను ఏర్పాటు చేస్తారు. అదే తరహాలో ఈ స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణం జరిగింది. స్విమ్మింగ్‌ఫూల్‌లో స్విమ్మింగ్ చేస్తున్న వ్యక్తులు హఠాత్తుగా నీట మునుగుతున్న సమయంలో చుట్టూ ఏర్పాటు చేసిన గట్టు పట్టుకుని వారు శ్వాస తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇక్కడ ఆ అవకాశం లేకపోవడంతో ఏటవాలుగా జారిపడిన వ్యక్తి తలకు దెబ్బ తగలడం లేదా స్పృహ కోల్పోవడం వంటివి జరిగి మృత్యువాత పడుతున్నట్లు తెలుస్తుంది. ఇటువంటి వాటిపై సంబంధిత అధికారులు స్పందించి సరైన క్రమంలో నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణం నిబంధనలు ఎలా ఉండాలి

స్విమ్మింగ్ ఫూల్ ఏర్పాటు చేసే సమయంలో స్థానికంగా ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్లానింగ్ అప్రూవల్ పొందాలి. స్విమ్మింగ్ కోచ్ పర్యవేక్షణలో మాత్రమే స్విమ్మింగ్ చేయాలి. లేకపోతే లైఫ్ గాడ్‌ను ఏర్పాటు చేసుకుని అతని సమక్షంలో స్విమ్మింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలి. నీరు ఎప్పుడూ తేటతెల్లంగా అడుగు భాగంలో ప్రతిదీ కనిపించేలా ఉండాలి. ఫిల్టర్లను ఏర్పాటు చేసి ఎప్పటిక`ప్పుడు నీటిని శుభ్రపరచాలి. ఎప్పటికప్పుడు సంబంధిత స్పోర్ట్స్ అథారిటీ అధికారుల పర్యవేక్షణ ఉండాలి. స్విమ్ సూట్ తప్పనిసరిగా ధరించి మాత్రమే స్విమ్మింగ్ చేయాలి. వట్లూరులో ఏర్పాటుచేసిన స్విమ్మింగ్‌ఫూల్‌ను పై వాటిలో ఏ ఒక్క నిబంధనకు లోబడి నిర్మాణం చేపట్టలేదని స్పష్టంగా తెలుస్తుంది. ఏడాది కాలంలో ఇద్దరు ఈ స్విమ్మింగ్ ఫూల్‌లో మునిగి మృతి చెందడంతో స్థానికంగా ఈ ఫూల్‌ను డెత్ ఫూల్‌గా అభివర్ణిస్తున్నారు. అధికారులు స్పందించి స్విమ్మింగ్‌ఫూల్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నగరంలోని స్విమ్మింగ్ ఫూల్

నిబంధనలకు లోబడి స్విమ్మింగ్ నేర్పిస్తాం
స్విమ్మింగ్ కోచ్ గణేష్ ఏలూరు

మేము స్విమ్మింగ్ కోచింగ్ ఇచ్చే సమయంలో నిబంధనలకు లోబడి స్విమ్మింగ్ నేర్పిస్తాం. స్విమ్మింట్ సూట్ వేసుకున్నాకే స్విమ్మింగ్ చేసేందుకు అనుమతిని ఇస్తాం. కోచ్ సమక్షంలో మాత్రమే స్విమ్మింగ్ చేయాలి. స్వి మ్మింగ్ పూర్తిగా తెలిసినవారు డైవింగ్ చేసేందుకు ప్రత్యేక స్విమ్మింగ్ ఫూల్ లోతును ఏర్పాటు చేయాలి. బాలురు, యువకులు స్విమ్మింగ్ చేసే సమయంలో పర్యవేక్షణ తప్పనిసరి.

తాగునీటి సమస్య పరిష్కరించండి

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి
కొయ్యలగూడెం 7వ వార్డు వాసుల నిరసన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అక్రమ నిర్మాణం నిలిపివేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని కొయ్యలగూడెం ఏడో వార్డు చేపల పేటవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము దాదాపు 50 ఏళ్లుగా చేపల పేటలో నివసిస్తున్నామన్నామన్నారు. గ్రామంలో ఆర్ఎంపి డాక్టర్‌కు 15 ఏళ్ల క్రితం అప్పటి తహశీల్దార్ కార్యాలయం ద్వారా ఒకటిన్నర సెంటు పట్టా భూమి కేటాయించారన్నారు. కాని ఆయన ఆ భూమిని ఉపయోగించుకోలేదని, అనంతరం ఆ భూమిని పంచాయతీ స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఇక్కడ ఉన్న ప్రజలు కోరిక మేరకు పదేళ్ల క్రితం అప్పటి పంచాయతీ సర్పంచి గంజిమాల దేవి ఆ భూమిలో బోరు మోటార్ వేశారన్నారు. మూడేళ్లు తాగునీరు వచ్చాయన్నారు. ఇటీవల పరింపూడిలో ఉన్న బోరు మోటార్ మరమ్మతులకు గురైందని చెప్పారు. దీంతో ప్రస్తుత సర్పంచి చేపలపేట వద్ద ఉన్న మోటార్‌ను పరింపూడికి మార్చారన్నారు. మళ్లీ ఇక్కడ బిగిస్తామని చెప్పారని తెలిపారు. ఈ క్రమంలో ఆ స్థలంలో ఒక వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టడంతో తాము అడ్డుకున్నామని చెప్పారు. అనంతరం కలెక్టర్‌కు రిజిస్టర్ పోస్ట్ చేసి ఆ కాపీలను తహశీల్దార్‌కు, పంచాయతీ సెక్రటరీకి ఇచ్చామని తెలిపారు. దీనిపై సర్పంచి ముప్పిడి విజయ కుమారిని వివరణ కోరగా సంబంధిత విషయంపై దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఎలాంటి అపోహలకు గురి కావొద్దని, విచారణకు ఆదేశిస్తామని తెలిపారు.


నిరసన తెలుపుతున్న కొయ్యలగూడెం ఏడో వార్డు వాసులు

భూమిని ఆక్రమించాడు
జన జగ్గారావు, మాజీ వార్డు మెంబర్

గత 50 ఏళ్లుగా మేము ఇక్కడే ఉంటున్నాం. 15 ఏళ్ల నుంచి పంచాయతీ బోరు మోటార్ ఉంది. వేరే చోట అవసరం నిమిత్తం సర్పంచి ఆదేశాల మేరకు మోటార్ పట్టుకెళ్లారు. మేము అడిగితే మళ్లీ తెస్తామన్నారు. మోటార్ తెకపోగా ఆ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు. ఇంటి నిర్మాణానికి పునాది కూడా తవ్వాడు. దీనిపై తాము అడిగితే పంచాయితీ ఆదేశాలు మేరకు శుభ్రం చేస్తున్నానని సమాధానం చెప్పాడు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి
పాండ్రుకు శ్రీను, సొసైటీ ప్రెసిడెంట్

ఏడో వార్డు, పదో వార్డు ప్రజలు ఇక్కడ సత్యసాయి బాబా గోదావరి నీరు తాగుతున్నారు. ఇక్కడ ఇంటి నిర్మాణానికి అనుమతులు ఎవరిచ్చారు. వెంటనే ఇక్కడ పంచాయతీ మోటార్ వేసి తాగునీటి సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ భూమిలో ఇంటి నిర్మాణం తగదు.

పంచాయతీ భూమి ఆక్రమణ తగదు
నవిరి లక్ష్మీనారాయణ, సొసైటీ సెక్రటరీ

పంచాయతీ భూమి ఆక్రమణ ఆమోదయోగ్యం కాదు. ఇక్కడ నిర్మాణం ఆపాలి. వెంటనే బోరు మోటార్ బిగించి మాకు తాగునీరు అందించాలి.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం కేసులో ద్వారకాతిరుమల పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావును కమిషనర్ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి కృష్ణతేజ విధుల నుంచి సస్పెండ్ చేశారని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కొంతకాలంగా అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో విచారణ చేసి వెంకటేశ్వరరావును సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

ఆందోళన బాటలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

ప్రజాశక్తి - ఉంగుటూరు

గత ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో సేల్స్‌మేన్లు, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్నామని ఉంగుటూరు మండల ఉద్యోగులు వెల్లడించారు. ఈ మేరకు ఏలూరులో మద్యం డిపో మేనేజర్ దేవదత్తుకు మంగళవారం సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. అక్టోబరు 1 నుంచి ప్రయివేట్ మద్యం దుకాణాలను నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని తీసుకువచ్చే నెపంతో ఇంత కాలం పనిచేసిన తమకు ఉద్యోగ, ఆర్థిక భద్రతలు కల్పించిన తరువాతే కొత్త మద్యం విధానం వైపు వెళ్లాలని, అప్పటివరకు తమ ఆందోళన, దీక్షలు కొనసాగిస్తామని ఉంగుటూరు మండల నాయకుడు మూల సురేష్ వెల్లడించారు. ఎపి రాష్ట్ర బేవరీస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు 7న మద్యం దుకాణాలను మూసేసి బంద్ పాటిస్తామన్నారు.

గ్రామ సచివాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - ముసునూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెడుతున్న కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యే విధంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపిడిఒ జి.రాణి సచివాలయ సిబ్బందికి సూచించారు. మండలంలోని చింతలవల్లి, చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం పలు గ్రామాల్లో సచివాలయాలను ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

ముసునూరు: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కరిముల్లా చెప్పారు. మండలంలోని రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద రమణక్కపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు.

స్కూల్స్, కాలేజీల బస్సు డ్రైవర్స్ యూనియన్ ఏర్పాటు


చింతలపూడి : భగత్ సింగ్ స్కూల్, కాలేజీ బస్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఏర్పాటైంది. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సిఐటియు నాయకులు యూనియన్ పటిష్టత గురించి మాట్లాడారు. యూనియన్ పేరును భగత్ సింగ్ స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్స్ యూనియన్‌గా పెట్టారు. అనంతరం కమిటీ ఎన్నికలు నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షులుగా నత్తా వెంకటేశ్వరరావు, సలహాదారుగా చేపూరి రమణారావు, అధ్యక్షులుగా ఎ.మధు, కార్యదర్శిగా ఎం.రవికుమార్, కోశాధికారిగా పి.నాగబాబు, ఉపాధ్యక్షులుగా బాపనయ్య, సహాయ కార్యదర్శిగా సర్వేశ్వరరావు, కమిటీ సభ్యులుగా దుర్గారావు, విజయకుమార్, అభిషేక్, పుల్లారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ గ్రామ కార్యదర్శులతో పారిశుధ్యం, తాగునీరు సరఫరా పలు అంశాలపై ఆయన సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో కచ్చా డ్రెయిన్లు నుంచి నీరు పొంగి ప్రవహించడంతో వర్షపు నీరు నిల్వ ఉండడంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారా లేదా అనేది గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ముదినేపల్లి మండలంలో పారిశుధ్య పరిరక్షణ, తాగునీటి సరఫరా భేషుగా ఉందన్నారు. వర్షాల కారణంగా గ్రామాల్లో, కాలనీల్లో, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో నీటిని బయటకు తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణం ఇదే పరిస్థితిలో ఉందని, మరిన్ని చర్యలు చేపట్టడానికి సమయం పడుతుందని చెప్పారు. రెండు గ్రామాల్లో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, వాటిని పరిశీలించి మెరుగుపరుచుతామని చెప్పారు. మండలంలో కోతులు, కుక్కల బెడద తమ దృష్టికి వచ్చిందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. చట్టబద్ధంగానే వాటిని గ్రామాల నుంచి బయటకు తరలిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, పలు గ్రామాల గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ శ్రీనివాస్ విశ్వనాథ్

ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

వేలేరుపాడు మండలంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మంగళవారం పర్యటించారు. ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ చేయకముందే ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, నిత్య అవసరాల సరుకులు అన్ని ప్రజల వద్దకు చేర్చాలని ఎంఎల్ఎ అధికారులను ఆదేశించారు. ‌ రహదారులు పూర్తిగా పాడైపోయాయనితక్షణమే మరమ్మతులు చేసి రాకపోకలు సాగేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మా నినాదం అంటూ గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన కొణిదెల పవన్ కళ్యాణ్ అదేశాల మెరకు మండల వైస్ ప్రెసిడెంట్ మేచినేని సంజయ్ ఇంటి వద్ద మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవి కుమార్ , మండల అధ్యక్షులు గణేసుల ఆదినారాయణ,నాయకులు పాల్గొన్నారు.

అధిక పన్నుల వసూలును అరికట్టాలి : డివైఎఫ్ఐ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆశీ పన్నులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆర్‌డిఒకు అందించిన ఫిర్యాదును ఉల్లంఘించిన జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. నాయకులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టులతో కుమ్మక్కై మీకోసం ఆన్‌లైన్ పిటిషన్‌ను క్లోజ్ చేసిన జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. జంగారెడ్డిగూడెంలో ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె.మాబుసుభాని అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో జరుగుతున్న అధిక ఆసీలు పన్నులు రద్దు చేయాలని, అనధికారకంగా వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించకుండా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదును చట్టాన్ని ఉల్లంఘించి క్లోజ్ చేసిన జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిత్యావసరాల ధరలను తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాడిగడప జయరాజు డిమాండ్ చేశారు. స్థానిక సచివాలయం-1 వద్ద మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరచి అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించని పక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పులి సత్యనారాయణ, బొడ్డపాటి భవాని, జుజ్జువరపు మల్లిక, కోమటి భాగ్యశ్రీ, ఈడ వెంకటరమణ, మువ్వా బజారి, పొదిల రూబేను, జుజ్జువరపు మరియమ్మ, కీర్తన పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో ముగిసిన నాక్ టీం పర్యటన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ పీర్ టీం విజిట్‌లో భాగంగా రెండో రోజు మంగళవారం బెస్ట్ ప్రాక్టీస్ వివరాలను అడిగి తెలుసుకుని వాటి ఆధారాలను పరిశీలించారు. కాలేజీ డిస్టింక్ టివినెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగ లేబరేటరీని తనిఖీ చేశారు. కళాశాలలో మానవీయ విలువలు, పచ్చదనం పరిశుభ్రత, సమాజాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాల వివరాలు తెలుసుకుని వాటికి సంబంధించిన వివిధ కమిటీ అధ్యక్షులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఎకో క్లబ్ తదితర విభాగాల పనితీరులను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వరద బాధితులకు బిర్యానీ ప్యాకెట్లు

ప్రజాశక్తి - ముసునూరు

విజయవాడ వరద బాధితులకు ముసునూరు మండల పరిధిలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన రావర్ల ప్రతాప్, రావర్ల బాలకృష్ణ, రావర్ల మురళి, పలువురు గ్రామస్తులు బిర్యానీ ప్యాకెట్లు తయారు చేసి విజయవాడ తీసుకెళ్లారు. సుమారు ఐదు వేల మందికి బిర్యానీ ప్యాకెట్లు తయారుచేసి విజయవాడ వెళ్లి వరద బాధితులకు అందించారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నూజివీడు సిఐ ఎంవివిఎస్ఎన్.మూర్తి చెప్పారు. ఈ నెల ఏడో తేదీన వినాయక చవితి వేడుకలను పట్టణ ప్రజలందరూ ఆనందంతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఎక్కడైనా వినాయక మండపాలు ఏర్పాటుచేసేముందు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్, ఫైర్ వారి అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఎవరూ నిబంధనలను అధిక్రమించవద్దని సూచించారు.

విద్యార్థులకు పుస్తకాలు

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని ఆడమిల్లి డిగ్రీ కళాశాలకు ఆడమిల్లి గ్రామానికి చెందిన సింగపూర్‌లో ఉండే పారేపల్లి సతీష్‌కుమార్ 40 పుస్తకాలు బహూకరించడం అభినందనీయమని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎం.మల్లేశ్వరరావు అన్నారు. కాలేజీ సిపిడిసి మెంబర్ వీరమల్ల మధు చేతులమీదుగా 40 పుస్తకాలను కాలేజీకి అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ ప్రాంత విద్యార్థులకు సతీష్ కుమార్ పుస్తకాలను అందించడం చాలా గర్వంగా ఉందన్నారు.

30 వరకు పౌష్టికాహారం మహోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తల్లి గర్భం నుంచి పిల్లలకు ఉత్ప్రేరణ జరుగుతుందని ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవిఎల్.పద్మావతి అన్నారు. పౌష్టికాహార మహోత్సవంలో భాగంగా ఈ నెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు ఏడు రకాల అంశాలతో వివిధ రకాలైన కార్యక్రమాలను అంగన్వాడీ సెంటర్లలో నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా రెహమత్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పౌష్టికాహారం మహోత్సవాల కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవిఎల్.పద్మావతి ప్రారంభించారు. పోషణ బి-పడాబి అనే అంశంపై అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విధికి వివిధ అంశాలపై సంబంధించిన మెటీరియల్‌ను ప్రదర్శించారు.